క్లుప్తంగా

అన్నదానం



రిమ్స్ ఆవరణలో అన్నదానం చేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీనివాసులురెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం ఆయన కుమారులు చరణ్ సాయి, గంగాధర్ స్థానిక రిమ్స్ హాస్పిటల్‌లో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి పుట్టినరోజున రిమ్స్ వద్ద 200 మంది పేదవారికి అన్నదానం చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అశోక్, విజయ్, సంస్థ సభ్యులు శివకుమార్, బాబుజి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకుడు వనం శ్రీనివాసులకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.



వనం శ్రీనివాసులు

వైవీయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సహ ఆచార్యులు డాక్టర్ పి. ప్రమీల మార్గరెట్ పర్యవేక్షణలో 'ట్రైబల్ గర్ల్స్ ఎడ్యుకేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ : ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు కడప డిస్ట్రిక్ట్' అన్నఅంశంపై ఈయన చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. ఈయన రాసిన పరిశోధన వ్యాసాలు పలు జాతీయ జర్నల్స్ ప్రచురితమయ్యాయి.

ఘనంగా పింగళి వెంకయ్య వర్ధంతి



పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్ : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని గురువారం కడపలోని ఇన్సాఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.గౌస్‌బాష కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నజుమన్ పాఠశాల ఉపాధ్యాయురాలు శారద, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.గౌస్‌బాష తదితరులు పింగళి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవాసమితి అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా, జీఎంఆర్ రెసిడెన్స్ అధినేత మదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంక్షేమ సంఘం నాయకుడు రామచంద్ర మృతి



జి.రామచంద్ర

కడప కోటిరెడ్డి సర్కిల్ : వడ్డెర సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గొడ్డెలగల రామచంద్ర మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు బత్తల లింగమూర్తి, జిల్లా అధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి నారాయణ, నాయకులు బత్తల జానకిరామ్, రాయచోటి రామకృష్ణ సింహాద్రి, మంజుల సుబ్బరాయుడు, కుంచెం వీరయ్య ఇతర వడ్డెర సంఘం నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుని స్వగ్రామమైన చిలేకాంపల్లెకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించడంతోపాటు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రామచంద్ర వడ్డెర సంక్షేమ సంఘానికి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు మరవలేమని, ఆయన మృతి సంఘానికి తీరని లోటన్నారు.

భూ సమస్యతో పంటను దున్నేసుకున్న రైతులు

లింగాల : వెలిదండ్ల గ్రామంలో ప్రభావతి అనే మహిళకు చెందిన భూమిలో అరటి, టమోట, కంది పంటలను పక్కపొలం రైతులు ట్రాక్టర్‌తో దున్నేశారు. వివరాల్లోకి వెళ్తే సదరు భూ సమస్య గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, భూ సర్వే చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ప్రభావతికి చెందిన అరటి, టమోట, కంది పంటను పక్క పొలం రైతులు దున్నేశారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ లేకపోవడంతో ఫిర్యాదు చేయకుండానే వెనుతిరిగారు. భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సర్వే చేయించుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని పోలీసులు తెలిపినట్లు వారన్నారు.

మన్యం వీరుడి జీవితం స్ఫూర్తిదాయకం

వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ : భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు జీవితం స్ఫూర్తిదాయకమని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. గురువారం విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ప్రాంగణంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవజ్యోతి అల్లూరి జీవితం ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. బ్రిటిషర్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన సీతారామరాజు తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. బాల్యం, బ్రిటిషర్లపై పోరాటం ప్రధాన ఘట్టాలను వివరించారు. ఎంబీఏ సహఆచార్యులు డాక్టర్ గంగయ్య మాట్లాడుతూ మహావీరుడిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను చైతన్యం తీసుకురావడంతోపాటు ముందుండి నడిపించాడన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి , డాక్టర్ కె. లలిత, పీఓలు డా.ఎస్పీ వెంకటరమణ, డాక్టర్ రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు



ఏఎఫ్‌యూలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

వైవీయూ/ఏఎఫ్‌యూ : తెలుగుజాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమైన మన్యం వీరుడు అల్లూరి జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని డాక్టర్ వైయస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఎన్. రాజేష్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్ర పటానికి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజానికి.. అల్లూరి ధైర్య సాహసాలు ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు, ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించిన అల్లూరి జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అల్లూరి ఒక మహోజ్వల శక్తి

కడప అగ్రికల్చర్ : అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వలశక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అని డీసీసీ బ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటి రిజిస్ట్రార్ గురప్ప, డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణిలు అన్నారు. విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం కడప డీసీసీ బ్యాంకులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూలను ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ సలహాదారు సహదేవ రెడ్డి, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

కడప ఎడ్యుకేషన్ : విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. గురువారం కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంత కార్యాలయంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు మనోజ్, ముబారక్ బాష, సందీప్, చరణ్, ఆసిస్, సంతోష్ పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో అల్లూరి జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీసీసీ బ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటి రిజిస్ట్రార్ గురప్ప, బ్యాంకు సీఈఓ రాజామణి, సిబ్బంది



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు తెలిపారు. ఇందులో వాణిజ్యశాస్త్రం, భౌతికశాస్త్రం, ఆధునిక ఉర్దూ శాస్త్రం సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన అధ్యాపకులు కావాలని అన్నారు. దరఖాస్తు చేసుకునే వారు మాస్టర్ డిగ్రీలో 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. సంబంధిత దరఖాస్తులను ఈ నెల 11వ తేదీ పరిశీలించి అర్హులైన అభ్యర్థుల పేర్లను నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. 12వ తేదీ ఇంటర్వ్యూతోపాటు డెమోను నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రంకంతా ఎవరిని ఎంపిక చేసింది తెలియజేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

స్నాక్ ఫిట్ మిల్లెట్ మార్ట్ ప్రారంభం

కడప కార్పొరేషన్ : కడప నగరం రాజీవ్ పార్కులో ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సహకారంతో ఎల్‌బీఎస్ఎస్ఏఏ నిధులతో స్వయం సహాయక సంఘం సభ్యురాళ్ల చిరుధాన్యాల ఉత్పత్తులతో తయారు చేసే మిల్లెట్ యూనిట్ (మార్ట్)ను ప్రారంభించారు. రూ.2 లక్షలతో ప్రారంభించిన ఈ మార్ట్‌తో మెప్మా సంస్థ సభ్యురాలు భావనతోపాటు నలుగురు సంఘ సభ్యులకు జీవనోపాధి లభించింది. ఈ సందర్భంగా మార్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన అనేక ఆహార పదార్థాలు తక్కువ ధరకే తాము అందిస్తున్నామన్నారు. తమకు అన్ని విధాల తోడ్పాటు అందించిన ట్రైనీ కలెక్టర్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

శ్రీ రాజేశ్వరీ మాతకు ప్రాకారోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత అమ్మవారితోపాటు మహాదేవుడి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. రంగురంగుల పూలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారికి ఇష్టమైన బిల్వ పత్రాలతో అర్చన చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన పుష్పార్చన నిర్వహించారు. అనంతరం మహా నివేదన, కర్పూర హారతి ఇచ్చి నంది వాహనంపై కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి, శ్రీ రాజరాజేశ్వరీదేవిలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విశేష అలంకారంలో శ్రీ రాజరాజేశ్వరీదేవి

ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో డిగ్రీ ప్రవేశాల కోసం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు ప్రవేశాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈనెల 11 నుంచి 15వ తేది వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, 19న సీట్ల అలాట్‌మెంట్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారి పక్కన వల్లూరు మండల పరిధిలోని కట్ట బస్టాపు వద్ద వెలసిన పాపాఘ్ని వీరాంజనేయస్వామి తిరుణాల మహోత్సవంలో భాగంగా గురువారం సేద్యపు విభాగపు ఎద్దులచే నిర్వహించిన బండ లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 10 కాండ్ల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను కమిటీ సభ్యులు చిన్న ఓబులేసు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన ఎం.చెన్నకేశవ ఎద్దులు 2123 అడుగులు బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. పెండ్లిమర్రి మండలం పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన కే విశ్వనాథరెడ్డి ఎద్దులు 2089 అడుగులు బండను లాగి ద్వితీయ స్థానంలో, చెన్నూరు మండలం ఓబులంపల్లె గ్రామానికి చెందిన సానపురెడ్డి సతీష్‌రెడ్డి ఎద్దులు 2036 అడుగులు బండను లాగి తృతీయ స్థానంలో, ప్రొద్దుటూరు మండలం తిమ్మయ్య కాలనీకి చెందిన పాతకోట తేజేశ్వర్‌రెడ్డి ఎద్దులు 1543 అడుగులు బండను లాగి నాలుగవ స్థానంలో, వల్లూరు మండలం చెరువుకిందిపల్లె గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్‌రెడ్డి ఎద్దులు 1431 అడుగులు బండను లాగి ఐదవ స్థానంలో, వల్లూరు మండలం చెరువుకిందిపల్లె గ్రామానికి చెందిన సగిలి చెన్నకేశవరెడ్డి ఎద్దులు 1300 అడుగులు బండను లాగి ఆరవ స్థానంలో నిలిచాయి. వీరికి మొదటి బహుమతి రూ.30 వేలను మాజీ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి వితరణగా అందించారు. ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు, ఆరవ బహుమతి రూ.3 వేలను సంబంధిత దాతలు విజేతలకు అందించారు.



బండను లాగుతున్న ఎద్దులు

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి



వెల్లటూరులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ మురళీధర్‌రెడ్డి



కమలాపురంలో ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న కడప ఏడీఏ సురేష్‌రెడ్డి

పెండ్లిమర్రి : ఎరువులు, పురుగుమందుల దుకాణాదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయశాఖ ఏడీఏ మురళీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రి గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి ఉన్న స్టాక్, రికార్డులను పరిశీలించారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు రైతులకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎరువులు తీసుకున్న ప్రతి రైతుకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఓబులేసు పాల్గొన్నారు.

కమలాపురం : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని కడప ఇన్‌చార్జి ఏడీఏ సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన ఏఓ సరస్వతితో కలసి పరిశీలించారు. రికార్డులను, నిల్వ ఉన్న స్టాక్‌ను, నోటీస్ బోర్డులో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. డీలర్లు నిబంధనలకు లోబడే విక్రయాలు జరపాలన్నారు. ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని, అధిక ధరలు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా తాము కొన్న ఉత్పత్తులకు డీలర్ల వద్ద తప్పని సరిగా రశీదులు పొందాలన్నారు. అనుమతి ఉన్న దుకాణాల్లోనే మాత్రమే ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నారు.

రిమ్స్ దారిలో డివైడర్ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రిమ్స్ దారిలో డివైడర్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. గురువారం రిమ్స్ దారిని ఆర్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) కి జిల్లా నలుమూలలతో పాటు పక్క జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో రోగులు, వారి బంధుమిత్రులు వస్తూ ఉంటారని, ఆ దారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుందన్నారు. చెర్లోపల్లి రైల్వే వంతెన వరకు ఉన్న డివైడర్ ను రిమ్స్ వరకు పొడిగించగలిగితే సురక్షితమైన ప్రయాణాన్ని కల్పిస్తూ, ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు.

అతిసార వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

వేంపల్లె : తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాళ్లపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం హైస్కూల్‌లో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా బేగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతిసార వ్యాధి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ముఖ్యంగా హ్యాండ్ వాషింగ్, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే దోమల ద్వారా వచ్చే వ్యాధులు, లక్షణాలు నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, సూపర్‌వైజర్ అరుణాదేవి, ఏఎస్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

కడప కల్చరల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు గురువారం కడప నగరానికి చెందిన ఆర్యవైశ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం వద్దగల కమ్యూనిటీ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తల్లం సతీష్ మాట్లాడుతూ రోశయ్య చేసిన సేవలను కొనియాడారు. కడప నగరానికి ఆయన పలుమార్లు విచ్చేశారని, ప్రస్తుతం కార్యక్రమం నిర్వహిస్తున్న ఈ కమ్యూనిటీ హాలును ఆయనే ప్రారంభించినట్లు గుర్తుచేసుకున్నారు. ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని ఉన్నత స్థాయిలో నిలిపిన ఆయన సేవలను ఎన్నటికీ మరువలేమని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘంలోని వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

వేంపల్లె : భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ లోక్‌సభలో సభా సాంప్రదాయాలు పాటించకుండా హిందూవులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకి వ్యతిరేకంగా హిందూ ఐక్యవేదిక నాయకులు గురువారం వేంపల్లెలో నిరస తెలిపారు.

ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా వేంపల్లెలోని నాలుగురోడ్ల కూడలిలో రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మొత్తం హిందూ సమాజాన్ని హింసాత్మకంగా పిలిచాడని, ఇది హిందూవుల మనోభావాన్ని అవమానించడమేనన్నారు. పార్లమెంట్‌లో ప్రజల సమస్యలపైన పోరాడకుండా లేని సమస్యలని సృష్టిస్తూ భారతదేశానికి చెడ్డపేరు తీసుకురావడం ఏ మాత్రం మంచిది కాదన్నారు. హిందూవులపైన ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ వెంటనే భారతదేశానికి, హిందూవులకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు

విద్యా సంస్థల బంద్ విజయవంతం

కమలాపురం : నీట్ పరీక్షలను రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి తిరిగి పరీక్ష నిర్వహించాలని వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం కమలాపురం మండలంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం అయింది. దేశ వ్యాప్తంగా జరిగిన బంద్‌లో భాగంగా కమలాపురంలో ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు చేపట్టిన బంద్‌లో భాగంగా మండలంలోని కమలాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, నల్లింగాయపల్లె, ఎర్రగుడిపాడు తదితర గ్రామాలలో పాఠశాలలకు వెళ్లి మూయించారు. ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగానే తమ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేసిందన్నారు. అందులో భాగంగానే కేంద్రం రాష్ట్రాల విద్యా హక్కులను కాలరాస్తూ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షను తక్షణం రద్దు చేసి తిరిగి నిర్వహించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.



చిన్న చెప్పలి జడ్పీ హైస్కూల్‌ను మూయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నీట్ లీకేజీలపై సమగ్రదర్యాప్తు జరిపి ఎన్‌టీఏపై కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం నీట్ లీకేజీలపై దర్యాప్తు జరుపాలంటూ విద్యాసంస్థలకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. నీట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్‌టీఏను పూర్తిగా రద్దుచేసి లీకేజీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : నీట్ పరీక్షను రద్దు చేసి, ఎన్టీఏ ఏజెన్సీ సంస్థను రద్దు చేయాలని డిమాండు చేస్తూ గురువారం నిర్వహించిన బంద్ విజయవంతం అయిందని ఏఐఎస్ఎఫ్ జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్, మండలాధ్యక్షుడు లీలాకృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం అందులో ఆ విద్యార్థులందరు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించిన వారు కావడం అనేక అనుమానాలు కలిగిస్తోందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

కొండాపురంలో..

కొండాపురం : ఇటీవల నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం ఐక్య విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కొండాపురంలో పాఠశాలలను మూయించి బంద్ నిర్వహించారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి

కమలాపురం : వందలాది మందికి విద్యా బుద్ధులు నేర్పిన విశ్రాంత ఉపాధ్యాయురాలు చెప్పలి సుభాషిణి మృతి బాధాకరం అని, ఆమె మృతి కమలాపురం ప్రాంతానికి తీరనిలోటు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ తెలిపారు.

ఆమె గత కొంత కాలంగా హైద్రాబాద్‌లో నివసిస్తున్నారని, బుధవారం మరణించారని తెలుసుకున్న సాయినాథశర్మ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళలర్పించారు. సుభాషిణి 35 ఏళ్ల పాటు కమలాపురంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయురాలుగా, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సాయినాథశర్మ ప్రార్థించారు.



చెప్పలి సుభాషిణి (ఫైల్)